క్లుప్తంగా

మా పల్లెకు 'మహాలక్ష్మి' కావాలి..



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సంతు, గ్రామ పెద్దలు

ఇల్లెందురూరల్: కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణం జరిగిన మా పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మండలంలోని బోయి తండా సర్పంచ్ బానోత్ సంతు, గ్రామ పెద్దలు సోమవారం ఇల్లెందు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ సంతు మాట్లాడుతూ.. దశాబ్దం క్రితమే రహదారి అధ్వానంగా ఉన్న సమయంలోనే ఆర్టీసీ అధికారులు బోయితండా వరకు బస్సు సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం అందుబాటులో ఉందని, ప్రస్తుత ప్రభుత్వం ఆర్టీసీలో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి తాము నోచుకోవడం లేదని, గతంలో రద్దు చేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



ఆస్పత్రిలో పాలు, పండ్లు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇల్లెందులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాళ్ల సోమసుందర్, నియోజకవర్గ కన్వీనర్ బలగాని గోపీకృష్ణ మాట్లాడుతూ... వాజ్‌పేయి నాయకత్వంలోనే దేశానికి సుస్థిరపాలన అందిందని, అదే తరహాలో నేడు మోదీ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, రామిరెడ్డి, భట్టు రమేష్, రంజిత్ కోరీ, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపులో కొత్తగూడెం బ్రాంచి సెక్రటరీగా పనిచేస్తున్న జే.శ్రీనివాస్ సోమవారం టీబీజీకేఎస్‌కు రాజీనామా చేసి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇంతకు ముందు ఉన్న టీబీజీకేఎస్ యూనియన్ కమిటీ ఏకపక్ష ధోరణితో వ్యవహరించిదని, అందువల్ల కార్మికులు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించారన్నారు. అప్పుడు ఉన్న యూనియన్ పెద్దలు ఇప్పుడు వేరే యూనియన్ కండువాలు కప్పుకున్నారని ఇందుకు మనస్తాపం చెంది తాను ఈరోజు ఐఎన్‌టీయూసీలో చేరినట్లు చెప్పారు.

టీబీజీకేఎస్‌ను గెలిపించండి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం (టీబీజీకేఎస్)ను ఇప్పటికే రెండుసార్లు గుర్తింపు సంఘంగా కార్మికులు ఎన్నుకున్నారని, మూడోసారి కూడా గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం రామవరం టీబీజీకేఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, 18శాతం ఉన్న లాభాల వాటాను 32శాతానికి పెంచి పంపిణీ చేశారని, జాతీయ కార్మిక సంఘాలు పొగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి సాధించి సుమారు 13 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో సింగరేణి కార్మికుల చిరకాల కోరిక సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేసే ఏకైక నాయకుడు కేసీఆర్ అన్నారు. ఈనెల 27న సింగరేణిలో జరగనున్న సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ గుర్తు బాణంపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాపు సీతాలక్ష్మి, బాదావత్ శాంతి, మండే వీర హనుమంతరావు, రాంబాబు, దామోదర్, కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య, మోరే రమేష్, మోరే భాస్కర్, ఎంఏ రజాక్, సూరిబాబు, రాజేంద్రప్రసాద్, అనుదీప్, గడప రాజయ్య, కనుకుంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



టేకులపల్లి పెంతెకొస్తు చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ ట్రీ, విద్యుత్ కాంతులతో స్టార్స్ వేలాడదీయడం, క్రిస్మస్, న్యూ ఇయర్ గ్రీటింగ్స్‌తో అంతా పండుగ ఉత్సాహం, వేడకతో కోలాహలం నెలకొంది. ప్రార్థనా మందిరాలన్నీ రంగురంగుల విద్యుత్ దీపకాంతుల్లో ధగధగలాడాయి. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా ఫాదర్లు, పాస్టర్లు కేక్ కట్ చేసి క్రీస్తు బోధనలను వినిపించారు. ప్రజలను సన్మార్గంలో నడిచేందుకు ఏసు బోధనలు దోహదపడతాయని, ఏసుక్రీస్తు లోకాన్ని రక్షించడానికి జన్మించాడని గుర్తు చేశారు. క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవన గమనం నేటికీ అందరికీ ఆచరణీయమన్నారు. దాతృత్వం, త్యాగం తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆయా చర్చిలకు వచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్ని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాల్వంచ: క్రిస్మస్ వేడుకల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, కొత్వాల శ్రీనివాసరావు





టేకులపల్లి: సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో డ్యాన్స్ చేస్తున్న యువతులు, సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో...



చుంచుపల్లి తండా చర్చిలో క్రిస్మస్ వేడుకలు..



టేకులపల్లి మరనాత చర్చిలో ప్రార్థనలు..



కొత్తగూడెంటౌన్: చర్చి వద్ద భక్తుల సెల్ఫీ



సెయింట్ ఆండ్రూస్ చర్చిలో..



జూలూరుపాడు: హోలీఫెత్ మినిస్ట్రీస్‌లో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు



అంబేడ్కర్ కాలనీలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న లేళ్ల వెంకటరెడ్డి



సెయింట్ అండ్రూస్ చర్చిలో...





ఇల్లెందు: ప్రత్యేక ప్రార్థనలలో మున్సిపల్ చైర్మన్ డీవీ, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



ఇల్లెందురూరల్: సుంకరగూడెం చర్చిలో...



సీఎస్పీ బస్తీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



సింగరేణి(కొత్తగూడెం): మైమ ప్రత్యక్షత మినిస్ట్రీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



జూలూరుపాడు: నృత్యం చేస్తున్న చిన్నారులు



పాల్వంచ: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



సుజాతనగర్‌లో పెంతెకోస్తు చర్చిలో...



మాలబంజర చర్చిలో



కొత్తగూడెంటౌన్: రాంనగర్‌లోని మన్నా చర్చి వద్ద..



సుజాతనగర్‌లో సీయోను చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు



చుంచుపల్లి: విద్యానగర్‌లో ఓ ఇంట్లో...



ఇల్లెందు: సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు



సుజాతనగర్: సింగభూపాలెం చర్చిలో...



టేకులపల్లి: రావులపాడు చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు



కొత్తగూడెంటౌన్: సెయింట్ ఆండ్రూస్ చర్చిలో...

సింగరేణి ఆక్రమిత స్థలాన్ని కాపాడండి..



స్థలాన్ని పరిశీలిస్తున్న కామేష్ తదితరులు

చుంచుపల్లి: విలువైన సింగరేణి స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ యెర్రా కామేష్ ఆరోపించారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి చుంచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కబ్జాకు గురైన సింగరేణి స్థలాన్ని సందర్శించారు. మాట్లాడుతూ... సింగరేణి స్థలాలను కాపాడటంలో అధికారులు విఫలమవుతున్నారని గతంలో ఇక్కడ ఉన్న సింగరేణి క్వార్టర్ కూలిపోవడంతో సదరు ఖాళీ స్థలంపై కన్నేసిన కబ్జాదారులు ఆ స్థలాన్ని చదును చేసి ఆటస్థలం అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఓ పాఠశాల యజమాని ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంటరానితనాన్ని రూపుమాపుదాం..



టేకులపల్లి: మండల కేంద్రంలో మనుస్మృతి కాపీలను దహనం చేస్తున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచ జాతీయ రహదారి అంబేద్కర్ సెంటర్‌లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం వర్ధిల్లాలి.. మనుధర్మ శాస్త్రం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. బహుజనులను అతినీచంగా చూసిన మనుధర్మ శాస్త్రాన్ని 1927, డిసెంబర్ 25న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పదివేల మంది కార్యకర్తల సమక్షంలో మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేశారని, దానికి గుర్తుగా పాల్వంచలో ప్రతులను దహనం చేశామని తెలిపారు. కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, తొలి,మలి తెలంగాణ ఉద్యమ కారుడు శ్రీపాద సత్యనారాయణ, బీసీ నాయకులు చిటికిన ముసలయ్య, నబీసాహెబ్, జిల్లా అధ్యక్షుడు మంజూర్, ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, పాల్వంచ పట్టణ నాయకుడు శ్రీను, గుర్రం వెంకటేశ్వర్లు, భాస్కర్, శనగ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మహిళలపై, దళితులపై సాంఘిక దురాచారాలను, అంతరానితనాన్ని రూపుమాపాలని, హిందూ బ్రాహ్మణీయ మనువాద భావజాలాన్ని, మనుస్మృతిని దహనం చేయాలని మార్క్స్, అంబేద్కర్ అధ్యయన వేదిక రాష్ట్ర కార్యదర్శి మెంతెన ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ప్రజాఫ్రంట్‌తో కలిసి మండల కేంద్రంలో నిరసన తెలియజేశారు. మనుస్మృతి కాపీలను దహనం చేశారు. మాట్లాడుతూ.. దేశంలో కులం పేరుతో దళితులపై సాంఘిక దురాచారాలను, అంటరానితనాన్ని, అరాచకాలను పెంచి పోషించే హిందూ బ్రాహ్మణీయ మనుస్మృతిని దహనం చేయాలన్నారు. వందేళ్లు దాటుతున్నా నేటికీ వివక్ష తగ్గడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల రంజిత్, రాము, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా నాయకులు ఎట్టి ప్రశాంత్ పాల్గొన్నారు.

29న విగ్రహావిష్కరణ

జూలూరుపాడు: ఈనెల 29న కాకర్ల గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి 21 అడుగుల సుధామూర్తి విగ్రహాన్ని ఉదయం 9 గంటలకు శ్రీశ్రీశ్రీ తిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతులను ఆదుకోండి..

టేకులపల్లి: తెలంగాణలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకి రైతుబంధు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎకరం ఉన్న వాళ్లకు మాత్రమే రైతుబంధు వేశారని మిగతా రైతులకు వేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికే రాష్ట్రంలో తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, యాసంగి పంట వేసుకుందామంటే చేతిలో చిల్లిగవ్వ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మీద ఆధారపడే కొంతమంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని ఆయన తెలియజేశారు.

ఏకేఎఫ్ఐ వైస్ ప్రెసిడెంట్‌గా వీరేష్

కొత్తగూడెంటౌన్: అఖిల భారత కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కాసాని వీరేష్‌ను కాసాని యువసేన అధ్యక్షుడు శ్రీరాముల విశ్వనాథ్ హైదరాబాద్‌లో సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వీరేష్ రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తాం..



జేకే ఓసీలో గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు: సింగరేణి ఎన్నికల్లో ఆరునూరైనా ఐఎన్‌టీయూసీ విజయం సాధించాలని, అప్పుడే కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం షిఫ్ట్ సమయంలో ఇల్లెందులోని జేకే ఓసీలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 2015 నుంచి తనకు సింగరేణి కార్మికులతో అనుబంధం ఉందన్నారు. గత ఎన్నికల్లో తాను ఈ ప్రాంతంలో పని చేసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చానని గుర్తు చేశారు. గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆనాటి పాలకులు ఏనాడూ కార్మికుల సమస్యలు విన్నవించేందుకు అవకాశం ఇవ్వలేదని, మీతోపాటు నేనూ బీఆర్‌ఎస్ మాటలు నిమ్మి మోసపొయ్యానన్నారు. అందరి కృషితో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, మంత్రివర్గంలో తాను ఓ మంత్రిగా ఉన్నానని ఆనాటి సమస్యలతో పాటు ఈసారి సింగరేణి సమస్యలు పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కొట్లాడి సింగరేణి కార్మికులకు న్యాయం జరిగేలా హక్కులు సాధించిపెడుతానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో రాష్ట్రంలో ఏ శాఖ చూసినా అవినీతి, అక్రమాలు, నిధుల దుబారా జరిగిందన్నారు. ప్రజలు, కార్మికులకు స్వేచ్ఛ లేని జీవితం గడిపారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్, క్యాడర్ స్కీం, బదిలీలు, ప్రమోషన్లతో పాటు ఇల్లెందులో ఓసీ ఏర్పాటుకు అనుమతులు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న కార్మికులను ఇక్కడే కొనసాగేలా చూస్తామన్నారు. కార్మికులు ఐఎన్‌టీయూసీని గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం వివిధ యూనియన్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీపీసీసీ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, ఎస్‌కే జానీ, మువ్వా విజయ్‌బాబు, పింగళి నరేష్, భూక్యా దళ్‌సింగ్ నాయక్, డానియేల్, పులి సైదులు, లింగాల జగన్నాథం, కళ్లం కోటిరెడ్డి, కన్నయ్య, కుమార్‌సింగ్ బోలా, ఇమామ్, మహబూబ్, జే.వెంకటేశ్వర్లు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌కు హాజరైన సింగరేణి కార్మికులు, ఉద్యోగులు